క్లుప్తంగా

శివకామేశ్వరీ అమ్మవారికి పూర్ణఫల అర్చన


శివకామేశ్వరీ అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూర్ణఫల(కొబ్బరికాయ) అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన, శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. అలాగే శ్రీశివజ్ఞాన పీఠంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అక్షరాంబికకు పలు రకాల పుష్పాలతో అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ శివాచార్యస్వామి వసంత నవరాత్రి ఉత్సవాల విశిష్టతను వివరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ డైటీషియన్ డాక్టర్ మాడుగుల ఇందూజ అన్నారు. స్థానిక సత్యనారాయణపురం నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాలలో ఆదివారం కిడ్స్ స్నాతకోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు స్నాతకోత్సవం ఎంతగానో దోహద పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల జీఎం శివారెడ్డి, ఏజీఎం కేశవరాజు, ప్రిన్సిపాల్ మీనాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీచ రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు


తోట శ్రీనివాస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వెన్నుపోటు, నీచ రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు అని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక దాడులకు పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. స్థానిక ముత్యాలంపాడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల విశ్వాసం కోల్పోయి ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేష్ ఎన్ని కుయుక్తులు చేసినప్పటికీ వారికి ఎన్నికల్లో ఓటమి తప్పదని అన్నారు. సీఎం జగన్‌పై దాడి చేయడం ద్వారా కూటమి కుట్రలు బయట పడుతున్నాయని అన్నారు. చంద్రబాబు, లోకేష్‌లను ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గరపడ్డాయని సీఎం జగన్‌పై దాడి చేసిన వారు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్‌టీఎస్ రోడ్డులో వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టడంతో మహిళ గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదలకు చెందిన కొల్లి వెంకటరమణ తన ఇరువురి కోడళ్లతో కలిసి వన్‌టౌన్‌కు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్నారు. మాచవరం క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో ఆటో దిగి బీఆర్‌టీఎస్ రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా వచ్చిన ఆటో వెంకటరమణ పెద్ద కోడలిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణ ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పూజ



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, మెట్లబజార్‌లోని కోదండ రామాలయంలో శ్రీ అయ్యప్పస్వామి పూజ, భజన 42వ వార్షికోత్సవం గురుస్వామి శరత్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. అనంతరం పడిపాట నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌స్వామి మాట్లాడుతూ గత 42 సంవత్సరాలుగా తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న స్వాములకు, గురుస్వాములకు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. గురుస్వాములు దీపక్, చిరంజీవి, కుమార్, రామకృష్ణ, వాసు, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి

- వాడవాడల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు
- చిత్రపటాలు, విగ్రహాల వద్ద ఘనంగా నివాళి


ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో నివాళులు


పోలీస్ కమిషనరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు


బావాజీపేటలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వసంతకుమార్


అరుణోదయ నగర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


నివాళులర్పిస్తున్న దేవిడ్‌రాజు, వీరభద్రరావు


బహుమతులు ప్రదానం చేస్తున్న సంతప్‌కుమార్



ఎస్ఆర్ఆర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దత్తు, కిషోర్, వర్మ, వికాస్ పాల్గొన్నారు. 27వ డివిజన్ బావాజీపేటలో ఆదివారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన అంబేడ్కర్ జయంతి జరిగింది. వాకర్స్‌క్లబ్ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోకర్ణేశ్వరరావు, కేరాము, జీ ఏడుకొండలు పాల్గొన్నారు. అలాగే మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. జీసీజీటీఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కేఆర్‌జీ శేషుకుమార్, సుధాకర్, డాక్టర్ కే రమేష్ పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా గిరిపురం మూడు బొమ్మల సెంటర్‌లో ఆయన విగ్రహానికి 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరియరాణి, మత్తేబాబు, మోజెస్, కుమారి, క్రాంతి పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఆదివారం 62వ డివిజన్ ఎల్బీఎస్ నగర్ మూడు బొమ్మల సెంటర్ వద్ద జరిగింది. వైఎస్సార్ సీపీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్, పలువురు నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు దుర్గారావు, మస్తాన్, రామిరెడ్డి, బ్రహ్మేంద్ర, శ్రీను, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


ఎల్బీఎస్ నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


సెంట్రల్ పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

64వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, సొసైటీ ఛైర్మన్ ఎం.రవీంద్రరెడ్డి, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, కొక్కిలిగడ్డ నాని, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు అంబేడ్కర్

విజయవాడ కల్చరల్: భారత జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు అన్నారు. అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు, పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ ఎందరో యువకులకు స్ఫూర్తి నిచ్చినట్లు తెలిపారు. సంస్థ సభ్యుడు టీవీ వీరభద్రరావు మాట్లాడారు. సంస్థ సభ్యులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ సంస్థల ప్రతినిధులు జోషి, డాక్టర్ జయంతి చక్రవర్తి, చిట్టిబాబు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ


ఏపీసీపీడీసీఎస్ కార్యాలయంలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం చిన్నారులకు వ్యాస రచన, ప్రసంగం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడస్పోర్ట్స్: సమాజంలోని సామాజిక అసమానతలు నిర్మూలించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చేసిన కృషి అభినందనీయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలు విజయవాడ ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే అంబేడ్కర్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. పార్టీ విజయవాడ పార్లమెంట్ కో ఆర్డినేటర్ లింగమనేని శివరాంప్రసాద్, మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు టి.సుందర్‌ప్రసాద్, వి.శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పోలిమెట్ల శరత్‌బాబు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి రుద్ర శంకర్, పచ్చిగళ్ల రమేష్, చేకూరి శ్రీను, తిప్పబత్తిన బాల, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇంద్ర, సిటీ అధ్యక్షుడు బుదాల శ్రీను, కార్యదర్శి దొడ్డ సురేష్, స్టేట్ ఎస్టీ సెల్ కార్యదర్శి మేడ రమేష్, డివిజన్ అధ్యక్షులు మేకల మరియబాబు, కండెల డేవిడ్, పల్లె బాబు, అరెం కళ్యాణ్, నాయకురాలు రుద్రపాటి స్రవంతి, నన్నం దుర్గా దేవి పాల్గొన్నారు.

ఏపీసీపీడీసీఎస్ కార్యాలయంలో..

ఏపీసీపీడీసీఎల్ కార్యాలయంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆ సంస్థ ఛైర్మన్, ఎండీ కె.సంతోషరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారతరావు, ఎస్ఈ ఎ.మురళీమోహన్, అధికారులు పాల్గొన్నారు.

అల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

లబ్బీపేటలోని ఆల్‌మునీర్ ఫౌండేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. అంబేడ్కర్ చిత్రపటానికి ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ మునీర్‌అహ్మద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అడ్వకేట్స్ అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్ మతీన్, కోశాధికారి ఖలీలుల్లా, షఫీ అహ్మద్, ఎండీ ఇంతియాజ్, హుస్సేన్ పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో..

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏడీసీపీలు కనకరాజు, కె.ఆర్.ప్రసాద్, ఏసీపీ పార్థసారథి పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. 57వ డివిజన్ అరుణోదయ నగర్‌లో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి తిప్పాబత్తిన బాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు నజీర్‌ఖాన్, కుంభా మణ్యం, చెన్నకేశవరెడ్డి, ఈసరపు రాజు, రమేష్ పాల్గొన్నారు. లూనా సెంటర్, అమెరికన్ హాస్పటల్, స్టెల్ హాస్పటల్ పరిసర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడికి నిరసన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం, పాస్టర్లు


సెంట్రల్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాలు, క్రైస్తవుల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై దాడిని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం ఖండించారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఆయన సీఎంపై దాడిని ఖండిస్తూ పలువురు పాస్టర్లతో కలిసి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన శాంతి, దయ, క్షమాగుణంతో జనరంజకంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి విచారకరమన్నారు. ఈ దాడిని యావత్ క్రైస్తవ సమాజం ఖండిస్తుందన్నారు. వైఎస్ జగన్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అన్ని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొలుత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ కనపర్తి ప్రభాకర్, పాస్టర్లు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా మేమంతా సిద్ధం అంటూ రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పట్టడాన్ని చూసి టీడీపీ నాయకులు ఇక తమకు ఓటమి తప్పదనే భయంతోనే దాడికి పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. సీఎం జగన్, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుపై జరిగిన దాడిని నిరశిస్తూ సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని సెంట్రల్ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రోడ్డుపై బైఠాయించి టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి మీద జరిగిన ఈ దాడి ముమ్మాటికీ టీడీపీ పిరికిపంద చర్య అని, దీనిపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీజానారెడ్డి, ఎండీ షాహీనాసుల్తానా, కొంగితల లక్ష్మీపతి, బెజ్జం రవికుమార్, ఎండీ హఫీజుల్లా, గుండె సుందర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

57వ డివిజన్‌లో..

స్థానిక 57వ డివిజన్ న్యూఆర్ఆర్‌పేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో సీఎం జగనన్నపై జరిగిన దాడిని పార్టీ నాయకులు వాసా బాబు, మల్లెల చెన్నకేశవరెడ్డి ఖండించారు. సమావేశంలో ఖాజా, ఉమర్‌పఠాన్‌ఖాన్, స్వామిదాస్ పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ ఆధ్వర్యాన దాడి జరిగిన ప్రదేశంలో దివ్యాంగులు టీడీపీకి వ్యతిరేకంగా ఆదివారం నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేసవిలో స్వచ్ఛంద సేవా సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేసి పాదచారులకు నీరు, మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సూర్యసత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిరాం థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేయర్ భాగ్యలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. అనంతరం చలివేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు మందులను అందిస్తున్నారని, చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులకు మజ్జిగ పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ రాజగిరి సోమేశ్వరరావు, సురకాశి ఈశ్వరరావు, బెవర సూర్యనారాయణ, సాయిరాం థియేటర్ యజమాన్యం సత్యనారాయణ, వేముల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్, కలరా హాస్పిటల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పాదచారులకు, వాహన చోదకులకు మజ్జిగ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే మొహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌కుమార్, సహాయ కార్యదర్శి యు.కనకారావు, శ్రీనివాసకుమార్, కొమెర రాజు, కానూళ్ల చంద్రశేఖర్, సతీష్ పాల్గొన్నారు.

రేపు సిద్ధార్థలో మాగ్నోవా 2కే24


పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేకేందుకు మాగ్నోవా-2కే24 పేరుతో ఈ నెల 16వ తేదీ మంగళవారం సిద్ధార్థ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. మాగ్నోవా 2కే24 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్‌లో ఆదివారం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా మాగ్నోవా పేరుతో పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెనరా బ్యాంక్ విజయవాడ జనరల్ మేనేజర్ పి.రవివర్మ హాజరవుతారని చెప్పారు. కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి కేవీ.రమేష్ చంద్ర మాట్లాడుతూ బిజినెస్ బ్రెయిన్ బ్యాటిల్, మార్కెట్ మేకర్స్, మాస్టర్ మైండ్స్ (యంగ్ మేనేజర్), బిజ్ బ్లాస్ట్(బిజినెస్ ప్లాన్), మిస్టర్ అండ్ మిస్ మాగ్నోవా, ఐపీఎల్ ఆక్షన్, లెట్స్ రీల్ ఇట్(రీల్ మేకర్) వంటి అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. అదే రోజు సాయంత్రం పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తామని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల, ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కె.విజయ్, కె.శ్రీనివాసులు, పి.కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు, అధ్యాపక బృందానికి మంచి పేరు తీసుకురావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల(పాయకాపురం) అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఇంటర్మీడియేట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ ఏడాది ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 82 శాతం ఉత్తీర్ణత సాధించారు. జి.సుధీర్ అనే విద్యార్థి 956 మార్కులు సాధించి, ఎన్టీఆర్ జిల్లాలో ద్వితీయ స్థానంలోనూ, కాలేజీలో ప్రథమ స్థానం వచ్చాడు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. జి.రాజ్యలక్ష్మి అనే విద్యార్థిని 470 మార్కులకు గాను 455 మార్కులు సాధించి ఎన్టీఆర్ జిల్లాలో ద్వితీయ స్థానం, కాలేజీలో ప్రథమ స్థానం వచ్చింది. జగనన్న ఆణిముత్యాలు పథకంలో కూడా అధిక మార్కులు సాధించిన వారికి ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహం లభిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాదరణను చూసి ఓర్వలేక దాడులు


మాట్లాడుతున్న డాక్టర్ గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక దాడులకు పాల్పడుతున్నారని ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌పై దాడి ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని, కూటమి ఆగడాలను రాష్ట్ర వ్యాప్తంగా ట్రేడ్ యూనియన్ నేతలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

పక్కా పథకం ప్రకారమే దాడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి పక్కా పథకం ప్రకారమే జరిగినట్లు అర్థమవుతుందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరి ఆదరాభిమానాలు చూరగొన్న వైఎస్ జగన్‌పై దాడి చేయడం అంటే, రాష్ట్ర ప్రజలందరిపై, ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. దీని వెనుక ఎవరు ఉన్నారు, ఎవరు కుట్రలు చేశారనేది ఎన్నికల కమిషన్, పోలీసులు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. దాడి విషయంలో టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారం చూస్తుంటే, పలు అనుమానాలు కలుగుతున్నారని మండిపడ్డారు. ఈ దాడి వెనుక లోకేష్, చంద్రబాబు కుట్రలు దాగి ఉన్నాయన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సీనియర్ గాయకుడు డేవిడ్ రాజు ఆధ్వర్యంలో పామర్తి పద్మ, కృష్ణసింధు, కంచి మల్లీశ్వరి, రేష్మ, జయప్రభ, ఉమాబలరాం దేశ భక్తి గీతాలతోపాటు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించి అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అంబేడ్కర్‌ను ఆత్మ గౌరవానికి ప్రతీకగా అభివర్ణించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు మాలపాటి వెంకటపతి, పెనుమాల జ్ఞానకిషోర్, బీవీ వీరభద్రరావు, పరచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్ అంబేడ్కర్ సామాజిక సేవలను వివరించారు.